# * తెలుగు పత్రికా రచయిత

రచన:
కవికొండల వర్ధనరావు

ఒకమంచికథరాయాలనుకున్నాడు ప్రఖ్యాత తెలుగు పత్రికారచయిత రావు.

డ్రాయరు సొరుగు లాగాడు, కాగితాలు నిండుకున్నాయి. "కేశవా!" అనుకున్నాడు.

బాబిగాడి స్కూలుపుస్తకాల్లోంచి ఒక 'ఎక్సెర్‌సైజు' నోట్సు తీశాడు: కుతూహలం చావకుండా కథ రాసేయాలని!

కూర్చున్నాడు ప్రశాంతంగా గదితలుపులు వేసుకుని, జేబులోని కలంతీసి రాయటం మొదలుపెట్టాడు: కథ పేరు కావాలా? "దరిద్రజీవితంలో కవిత్వం!"

పది పంక్తులు రాసాడు.

ఇక నల్లఅక్షరాలకు స్వస్తిచెప్పి తెల్లసిరా రాయటం మొదలుపెట్టింది కలం. "నారాయణ!" అనుకున్నాడు.

విదిపాడు అక్షరం రాయలేదు.

పెన్ను "బ్రష్" లూజుచేసి తల్లకిందులుగా పెట్టి బిగించి రాసిచూచాడు. ఫలితం శూన్యం! "మాధవా!" అనుకున్నాడు.

మెల్లిగా తలుపుతీసుకుని దొడ్లోకి వెళ్ళి "గోళెం"లోని నాలుగు నీటిచుక్కలు కలంలో పోసాడు.

"జేబులో పైసాలుంటే సిరానే పోయించుకునేవాణ్ణికదా!" అనుకున్నాడు.

మళ్ళీ రాత మొదలుపెట్టాడు పేజీదాకా యీడ్చేసింది.

రాత 'బ్రేక్' పడటంతో బాబిగాడి 'పెనిసిలు'ని వెతుక్కుంటూ వెళ్ళాడు దొరకలేదు.

"బాబిగాడు జేబులోనే వుంచుకుని వుంటాడు" అనుకున్నాడు.

పోనీ బాబిగాడు వచ్చేలోగా కాస్త కాఫీ పెట్టించుకుతాగితే కొద్ది హుషారుపుట్టి నాలుగు మంచిపదాలు కథలో పడతాయనే ఉద్దేశంతో శ్రీమతిదగ్గరకు వెళ్ళాడు.

"ఏమే కాస్త కాఫీ..." నీరసంగా ముఖంపెట్టి దీనంగా అడిగాడు.

"బాగుందండీ! ఇంట్లో 'షుగర్' లేదు. పాలమనిషి క్రిందటివారండబ్బులు యిస్తేగాని పాలు పోయనంది. పొడమూ మీ ధర్మాన్ని [illegible]ముక్కిపోయినదేవుంది. నీళ్లంటారా నూతి నిండా వున్నాయ్!" అని వూరుకుంది.

"హు!" నిట్టూర్చాడు బాధగా. "గోవిందా!" అనుకున్నాడు మనస్సులో.

"మరి ఆ పొడుంతో 'షుగర్' లేకుండానే కాస్త చేదు 'డికాషన్' తీసియిమ్మంటారా?" అని అడిగింది.

"ఛా! అదేం బాగుంటుంది పోనిస్తూ" అంటూ గదివైపు నడిచాడు నైరాశ్య హృదయంతో.

* * *

రావు బి.ఏ., ప్యాసయ్యాడు.

అభ్యుదయగామి. నిస్వార్థ నిరాడంబర జీవి, నిత్యజీవితంలో సత్యాన్నే ప్రేమిస్తాడు. అన్యాయాన్నీ, అధర్మాన్నీ, అత్యాచారాలను ఖండిస్తూ కలాన్ని పోనిచ్చే ఆదర్శరచయిత.

మొదట ఒక 'ఫరమ్'లో ఉద్యోగిగా చేరాడు. నాలుగు సంవత్సరాలు పనిచేశాడు. తోటి ఆఫీసర్ల మెప్పుపొందాడు. పనివాళ్ల హృదయాలనుచూరగొన్నాడు. కాని రావు హృదయం రోజురోజూ ఏదో అవ్యక్త వ్యథను అనుభవిస్తూండేది.

తను 'కుల్లును, అవినీతిని చూస్తూ ఎందుకూరుకుంటున్నాను?' అని మథనపడ్డాడు.

కలానికి కళ్లెంలాగాడు.

"అసలు బండారం" కథ పబ్లిషైంది— 'వక్రశ్రీ' పేరుతో ఒక ప్రఖ్యాత తెలుగు వారపత్రికలో—

అందరికీ కళ్ళకుకట్టినట్టు తెలిసిపోయింది: 'ఫరమ్'యొక్క 'బ్యాక్‌గ్రౌండ్' 'బ్లాక్ మార్కెట్' 'ఫరమ్'పై విశ్వాసం నశించింది.

మేనేజరు 'రాజారామ్'కి ప్రొప్రయిటరు 'అంజి'కి తెలుసు, ఈ తమ పరువు మర్యాదలను బజారులోపెట్టిన 'వక్రశ్రీ' అకౌంటెంట్ రావేనని ఫలితం రావుబర్తరఫ్.

ఉద్యోగాన్వేషణ జరిపాడు.

భార్యని, కొడుకుని వెంటపెట్టుకుని పట్నాలు తిరిగాడు. ప్రయివేటు ఆఫీసులు తిరిగాడు. నిరుద్యోగశిఖామణిగానే బయటపడ్డాడు.

గవర్నమెంటు నౌకరీలకు 'అప్లికేషన్స్' రాశాడు. ఫలితం బండిచక్రం!

అతికష్టంమీదా మహా ప్రయత్నంమీదా దొరికింది: రెడ్డీసన్‌మిల్లులో 'క్లర్కు' మూడు సంవత్సరాలు పనిచేశాడు.

15 వందల 'స్టాకు'ను 15 గా రూపొందించి లెక్కలు రాయమన్నాడు మేనేజరు.

రావు రాయనన్నాడు.

"ఎందుకు వ్రాయవని" గద్దించాడు మేనేజరు.

"నాకు తప్పుడు అకౌంట్లు వ్రాయటం ప్రజలను మోసగించటం తెలియ"దన్నాడు.

"అయితే ఫలిత మూహించావా?" అన్నాడు కోపంగా మేనేజరు.

"ఆ నేనే రాజీనామా యిస్తున్నా నాకూ అభిమానం ఆత్మగౌరవం వున్నాయ"న్నాడు రావు.

రావువిచారించలేదు. తను ఆత్మద్రోహం చేసుకోలేదు. తప్పుడులెక్కలు వ్రాసి ప్రభుత్వంకన్నులలోనూ, ప్రజలనోట్లోనూ మట్టికొట్టలేదు. అభిమానం, ఆత్మగౌరవం నాశనం చేస్కోలేదు. స్వాతంత్ర్యాన్ని అమ్ముకోలేదు. 'బతికేవున్నాను' అనుకున్నాడు. ఏమాత్రం బాధపడలేదు.

'ఛీ వెధవఉద్యోగాలు ఒక్కదాంట్లోనూ నీతిలేదు' నీతిలేని ఉద్యోగాలకు నిజాయితీ లేని నౌకరీలకు స్వస్తిచెప్పాడు రావు.

స్వతంత్రంగా, నీతిగా నిజాయితీగా బతకాలనుకున్నాడు. 'అటం' బాంబులాంటి ప్రశ్న! ఎట్లాగూ?

ఆలోచన ఆలోచన. ఎంత ఆలోచించినా నీతిగా బతకటానికి మార్గాలు కన్పించలేదు.

రావూ, శ్రీమతీ కొన్నిరోజులు శనివారం మరికొన్నిరోజులు 'ఏకాదశి' ఆచరించారు. బాబికిమాత్రం కలో గంజో తాగించారు,

నెల గడిచింది.

మిత్రుడు వెంకట్రామయ్యసలహా, బలవంతంతో ట్యూషన్లు చెప్పటం మొదలు పెట్టాడు. నాలుగు ప్రయివేట్లు కుదిరాయ్. ఒక మెట్రిక్ అమ్మాయితో అయిదు. మొత్తం మీద నెలకు 40 రూపాయలు సంపాదిస్తున్నాడు.

కథలు రాసిపంపితే ఏ పత్రికాధిపతైనా కరుణించి కాస్త 'రెమ్యూనరేషన్' పంపితే చాటంతముఖం చేసుకుని ఆనందిస్తాడు.

ఆ స్వల్ప సంపాదనతోటే సంతృప్తి పొందుతూ జీవితాన్ని సాగిస్తున్నాడు. శ్రీమతి అనుకూలవతి అవటంవల్ల నెలలో రెండు మూడు శనివారములూ, నాలుగైదు ఏకాదశలూ ఎదురవుతున్నా జీవితం తియ్యగానే వుంటోంది రావుకి.

*  *  *

ఉదయం ఇంకా నిద్రమంచం దిగాలని లేదు. పాలమనిషి కేకలుమాత్రం కలత నిద్రలో కలవరిస్తున్న రావుని చిరాకు పరచాయ్—

"ఇల్లా అయితే ఎల్లాగండీ! ఇక్కడ ఇంకా వాళ్ళు యివ్వలేదూ అంటూంటారు. ఆ ప్రయివేటు చెప్పించుకునే వాళ్ళకైనా కాస్త......"

శ్రీమతి సర్దిచెప్పుతోంది.

పాలమనిషి విసుక్కుంటూ కసుక్కుంటూ మొత్తంమీద వ్యంగ్యంగా వాళ్ళమీదా వీళ్ళ మీదా వంకలుపెట్టి తిట్టుతూ, 'ఇట్లా అయితే వ్యాపారం సాగినట్టే' అని సాగదీస్తూ పోసింది అర్థశేరు పాలూను.

రావు నిట్టూరుస్తూ లేచాడు.

శ్రీమతి కాఫీయిస్తూ "ఇవాళ నెలాఖరులావుంది" అంది.

"అవును"

"మరి"...ఆగిపోయింది ఇంటియజమాని బుచ్చి వెంకయ్యని చూచి.

"ఏమండి రావుగారూ! బాగున్నారా?"

"ఏదో మీ దయవల్ల..."

"ఆ నాది యేముందిలెద్దురూ...చూడండి మొన్నెలలో అద్దె ఇంకా బకాయివున్నది. క్రితం నెలదీ ఈనెలదీ కూడా పూర్తిగా యియ్యాలి. మరి ఈనెలలో పూర్తిగా సరి పెట్టాలండోయ్! రావు కాఫీగ్లాసు కింద పెడుతూ—

"అల్లాగే నండీ!" అన్నాడు.

"మీరు పెద్దమనుష్యులు, గౌరవనీయులు లేవకొట్టటం మంచిదికాదని వూరుకున్నాను. మొన్న మా తోడల్లుడు అన్నకొడుకు వున్నాడు చూసారూ 'రామప్ప పంతులు' గారి కాలేజీ ఆఫీసు గుమస్తా మీమీద రెండు రూపాయలు యెక్కువ యిస్తానంటూ వచ్చాడు" అని వెకిలి నవ్వునవ్వుతూ "మీరు నాయొక్క స్థితిగతులు కూడా..." అని అర్థోక్తిలోనే వూరుకున్నాడు బుచ్చి వెంకయ్య.

"అయ్యో! నాకు తెలుసునండీ. ఈ నెలలో మీ అద్దె పూర్తిగా సరిపెడతాను కదూ!" అంటూ నవ్వు పట్టలుచేసుకున్నాడు.

"ఆ శోధనాద్రిగారింటికా?" అంటూ మెల్లగా మెట్లుదిగాడు బుచ్చివెంకయ్య.

"అవునండీ!" అంటూ శ్రీమతిని తలుపు వేసుకోమని రోడ్డు యెక్కాడు రావు.

*  *  *

భోజనంచేసి కూర్చున్నాడు.

"ఏమండీ! రావుగారిల్లు ఇదేనాండీ!" అంటూ తడుముకుంటూ వచ్చాడు అపర యముడు షావుకారు రామయ్య.

"రండి రామయ్యగారూ!" అంటూ ఆహ్వానించాడు రావు.

"ఏమండీ ఇక్కడ వుంటున్నారా?" అంటూ లోపలికివచ్చి కూర్చుని "క్షేమంగా వున్నారా?" కుశలప్రశ్నల అనంతరం "చూడండీ మీపద్దు కాస్త 'శ్రీరామ' చుట్టుతారని వచ్చానోయ్" అని అన్నాడు.

"నేనూ అదే చూస్తున్నా...పాపం! మీ బాకీ చాలారోజులనుంచీ..." రావుకూడా అన్నాడు.

"ఆ ఫరవాలేదు దానికేంలెండి ... మీ బాకీ ఎక్కడికి పోతుంది...ఇవాళ కాకపోతే రేపు వసూలవుతుంది...నాకు మీపద్దు దగ్గర అటువంటి భయం లేదండోయ్!" అంటూ దస్త్రంవిప్పి పద్దుచూసి 20 రూపాయల పదమూడణాలని తేల్చాడు.

"సరే! చూడండీ రెండు మూడు రోజులలో..."

"ఓ దానికేం మీరు తలుచుకుంటే మరి వస్తా...అసలు జ్ఞాపకంచేద్దామని అంతే!" అంటూ శలవు తీసుకుని వెళ్ళిపోయాడు రామయ్యషావుకారు.

"హమ్మయ్య" అని వెక్కి బార్లపడ్డాడు రావు.

చిక్కమొహంతో బాబిగాడు స్కూలు నుంచి వచ్చాడు.

"నాన్నా!" పిలిచాడు బాధగా నెమ్మదిగా.

"ఏం?"

"నా కాంపోజిషన్ 'నోటు' పోయింది" కంఠంలో ఏడుపుజీరధ్వనించింది.

"అరె! ఇంతోటిదానికి ఏడ్చేస్తావేంరా?"

"మాస్టారుకొట్టి నాలుగు అణాలు ఫైను వేస్తారు" అంటూ యేడ్చేశాడు బాబిగాడు.

"పోనీలే డబ్బులిస్తాను...ఫైను చెల్లించి మరొక 'నోటు' కొనుక్కుందువుగాని—" అని బాబిగాన్ని సంతోషపెట్టి కాగితం తీసుకుని బాకీలజాబితా రాసుకున్నాడు.

మొత్తం 80 రూపాయలు తేలింది!

*  *  *

పోస్టులో 'పత్రిక' మరొక కవరూ వచ్చింది!

"దరిద్రజీవితంలో కవిత్వం" కథ పడ్డింది!

కథ చాలా బాగున్నదని తెలుపుతూ ఇంకా అటువంటి ఉత్తమ రచనలు తయారు చేయవలసిందిగా రాస్తూ కథకు 10 రూపాయలు 'రెమ్యూనరేషన్' పంపుతున్నామని రాసాడు పత్రికాధిపతి.

వడివడిగా వంటింట్లోకి 'షైఫదగ్గరకు' పరుగెత్తాడు.

ఉత్తరం చదివి ఆనందించింది...శ్రీమతి.

"అయితే మనం యీనెల నాలుగురూపాయలు 'ప్లస్ బేలన్స్'లో వున్నామన్నమాట" అంది చదివిన కాగితం యిచ్చేస్తూ.

"అరె నువ్వు లెక్కవేసుకున్నావన్నమాట" అని అడిగాడు శ్రీమతి ముఖంలోకి చూస్తూ ఆశ్చర్యంగా.

"ఊ మన బతుకులన్నీ ఇంతేగా!..." వ్యంగ్యంగా.

ఎఱ్ఱటి పెదిమలచాటునుంచి తెల్లటి చిరునవ్వు తొంగిచూసింది.